ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5


గురువారం 25 జూలై 2024

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మెదక్ అర్బన్, జూలై 24: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు అవకతవకలకు పాల్పడిన మెదక్ పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఓ కేసులో ఫిర్యాదుదారుల వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. విచారణ చేపట్టగా నిజమని తేలడంతో ఇద్దరిని సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌ను సన్మానించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 24 : సంగారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన బి.అశోక్‌రెడ్డిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి పట్టణంలోని రాంనగర్‌లో ఉన్న అశోక్‌రెడ్డి నివాసానికి వెళ్లిన జగ్గారెడ్డి పూలమాల వేసి, శాలువా కప్పి అశోక్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి తల్లి ప్రమీల, తమ్ముడు నాగిరెడ్డి ఉన్నారు.



సంగారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

రుణమాఫీ.. ఫ్యాక్టరీ పాలు!

రైతులకు తెలియకుండా వారి పేరిట రుణాలు

మాఫీ సందేశాలు చూసి అవాక్కైన రైతన్నలు

ఇది చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్వాకం

అని తెలుసుకుని ఫ్యాక్టరీ ముందు ఆందోళన

న్యాయం చేయాలని సర్కారుకు విజ్ఞప్తి



మనూరు మండలం అతిమ్యాల్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

నారాయణఖేడ్/మనూరు, జూలై 24: వారంతా చెరకు రైతులు! సాగు కోసం ఎలాంటి రుణాలూ తీసుకోకున్నా.. వారి రుణాలు మాఫీ చేస్తున్నట్టుగా బ్యాంకుల నుంచి సందేశాలు వచ్చాయి! దీంతో వారంతా కంగు తిన్నారు. ఆరా తీస్తే ఆశ్చర్యకరమైన విషయం బయటపడింది. సాగుకు ముందు చక్కెర కర్మాగారంతో వారు చేసుకున్న ఒప్పందాన్ని అడ్డుపెట్టుకుని.. ఫ్యాక్టరీ యాజమాన్యమే బ్యాంకుల నుంచి రుణలు తీసుకున్నట్టు తెలిసింది! దీంతో బుధవారం వారంతా ఆ కర్మాగారం ఎదుట ఆందోళనకు దిగారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం అతిమ్యాల్‌లో జరిగింది ఘటన. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి చక్కెర కర్మాగారానికి.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలోని రైతులు చెరకును సరఫరా చేస్తారు. ఈ మేరకు కర్మాగారం యాజమాన్యంతో ఒప్పందాలు చేసుకుంటారు. అప్పుడు కర్మాగారం యాజమాన్యం ఆ రైతులకు పంట సాగు కోసం చెరకు విత్తనం, ఎరువులు, ఇతర క్రిమిసంహారక మందులను సరఫరా చేస్తుంది. ఇందుకు సంబంధించిన డబ్బును.. చెరకు సరఫరా అనంతరం రైతుల నుండి రికవరీ చేసుకుంటుంది. ఈమేరకు రైతులతో ఒప్పందం చేసుకునే క్రమంలోనే కర్మాగారం యాజమాన్యం వారితో బ్యాంకు రుణపత్రాలపైన కూడా సంతకాలు చేయిస్తుంది. ఈ క్రమంలోనే.. వారి పేరిట రుణాలు తీసుకుంది. ఇటీవల సర్కారు రైతు రుణమాఫీలో భాగంగా తొలి విడత రూ.లక్ష లోపు రుణాలను బ్యాంకులకు చెల్లించిన నేపథ్యంలో.. నిజామాబాద్‌లోని నాందేవ్‌వాడ యూనియన్ బ్యాంకు శాఖ నుంచి పలువురు రైతులకు రెండు రోజులుగా రుణమాఫీ అయినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. మనూరు మండలం అతిమ్యాల్ గ్రామంలోని 120 మంది రైతులకు, నారాయణఖేడ్‌డివిజన్ పరిధిలో దాదాపు 500మందికి పైగా ఇలా సందేశాలు రావడంతో ఆరా తీయగా.. కర్మాగారం యాజమాన్యం రైతుల పేరిట రుణాలు తీసుకుందన్న విషయం తెలిసింది. దీంతో వారు బుధవారం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై మాగి చక్కెర కర్మాగారం జీఎం వెంగల్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. రైతులతో ఒప్పందం చేసుకునే క్రమంలో రుణ పత్రాలపై కూడా సంతకాలు తీసుకుని, వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఇందుకోసం బ్యాంకు నుంచి రైతుల పేరిట రుణం తీసుకుని.. వారు చెరకు సరఫరా చేసిన తర్వాత, వారి నుంచి రికవరీ చేసిన సొమ్మును బ్యాంకుకు చెల్లిస్తామని వివరించారు. రైతుల పేరిట తీసుకున్న రుణాలు మాఫీ అయిన నేపథ్యంలో.. దీనిపై తమ యాజమాన్యం బ్యాంకర్లతో చర్చిస్తుందని.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని ఆయన తెలిపారు.



ఆ సొమ్ము మాకు ఇవ్వాలి



మేం రుణం తీసుకోకున్నా.. మాఫీ అయినట్లు నిజామాబాద్ యూనియన్ బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది. కర్మాగారం వారు మాతో అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకుని, వారు రుణం తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. దీంతో మాకు రుణమాఫీ ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రభుత్వం ఈ రుణమాఫీ సొమ్మును మా ఖాతాలకు బదిలీ చేయాలి.

- మల్లిఖార్జున్ , అతిమ్యాల

మాఫీ సందేశం చూసి అవాక్కయ్యా



నిజామాబాద్‌లోని నాందేవ్‌వాడ యూనియన్ బ్యాంకులో నేనేమీ రుణం తీసుకోలేదు. నాకున్న మూడెకరాల్లో చెరకు పండించి సరఫరా చేయడానికి చక్కెర కర్మాగారంతో ఒప్పందం చేసుకున్నానంతే. ఇప్పుడు నాకు.. ఆ బ్యాంక్ నుంచి రుణమాఫీ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ సందేశం చూసి అవాక్కయ్యా.

- నర్సింహులు, అతిమ్యాల్

ఆరోగ్యశ్రీపై ఆశలు



- కొత్త కార్డుల జారీపై ప్రభుత్వ సానుకూలత
- సంగారెడ్డి జిల్లాలో 3,78,279 కార్డులు
- రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా జారీ

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఎదురుచూస్తున్నవారి ఆశలు చిగురించాయి. ప్రభుత్వం కొత్త కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. తెల్లరేషన్‌కార్డుతో సంబంధం లేకుండా త్వరలో కొత్త కార్డులు జారీ చేస్తామని సీఎం, మంత్రులు వెల్లడించారు. గతంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న(బీపీఎల్)వారికి రేషన్‌కార్డుకు అర్హులు. వారికే ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసే వారు. ఈ క్రమంలో రేషన్‌కార్డు (ఎఫ్ఎస్‌సీ) ఉన్నవారికే ఆరోగ్యశ్రీ పథకం వర్తించేది. 2018 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ లేకపోవడంతో ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి బ్రేక్ పడింది. తాజా ప్రకటించిన మేరకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆధార్ ప్రామాణికంగా కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేయనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో జారీ చేయనున్నదని ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు తెలిపారు.

80,543 మందికి చికిత్స

సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 లక్షల జనాభా ఉంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 3,78,279 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. వీటి ద్వారా సుమారు 12,39,764 మంది ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. జిల్లాలో 16 ఆరోగ్యశ్రీ ఎంప్యానల్డ్ ఆస్పత్రులుండగా, ఇందులో ఆరు ప్రభుత్వ, 10 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఇదివరకు ఆరోగ్యశ్రీ పథకం కింద 1,672 ప్యాకేజీలకు(సర్జికల్-1,383, మెడికల్-289) చికిత్స అందిస్తుండగా.. ఇటీవల మరో 163 ప్యాకేజీలను పథకంలో చేర్చారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 80,543 మంది చికిత్స పొందారు.

రూ.10 లక్షల పరిమితి

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల పరిమితి వరకు నగదు రహిత ఆరోగ్య చికిత్సలు పొందవచ్చు. ఆరోగ్య చికిత్సలతో పాటు రోగికి ఉచిత ఆహారం, రవాణా చార్జీలు కూడా ఈ పథకం కింద రోగికి చెల్లిస్తారు. రోగికి ఏడాదికి రూ.10 లక్షల వరకు ఆర్థిక రక్షణ పొందవచ్చు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం కింద చిన్న జబ్బు నుంచి గుండె మార్పిడి, గుండె సంబంధిత చికిత్సలు, కాలేయ మార్పిడి, కిడ్నీ మార్పిడి, కేన్సర్, మెదడు నరాల చికిత్సలు, డయాలసిస్ తదితర ప్రధాన రోగాలకు చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కొత్తగా జారీ చేయనున్న నూతన ఆరోగ్యశ్రీ కార్డులతో జిల్లాలో వేల మందికి వైద్య చికిత్సల పరంగా ప్రయోజనం చేకూరనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

అలైన్‌మెంట్ మార్చడం సాధ్యం కాదు

- పరిహారం కోసం ప్రత్యేక కమిటీ
- ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులతో కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూలై 24: ట్రిపుల్‌ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడం సాధ్యం కాదని, ప్రస్తుతం ఇస్తున్న పరిహారాన్ని పెంచడానికి ప్రయత్నిస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులకు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం సాయంత్రం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలోని రత్నాపూర్, చిన్నచింతకుంట గ్రామస్థులతో మాట్లాడారు. తక్కువ భూమి సేకరించాల్సిన అవసరం ఉండేలా అలైన్‌మెంట్ మార్చాలని రైతులు కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఒకసారి ఆమోదం పొందిన అలైన్‌మెంట్ ఎట్టి పరిస్థితులోనూ మారదని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. న్యాయమైన పరిహారం కోసం ఇప్పుడున్న మార్కెట్ రేటును సవరించడానికి ప్రత్యేకంగా కమిటీ వేసినట్లు చెప్పారు. భూముల ధరలను సవరిస్తే రైతులకిచ్చే పరిహారం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. భూమికి బదులుగా భూమి ఇచ్చేవిధంగా ఎలాంటి చట్టం లేదని, అందుకే ఇది సాధ్యం కాదని తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. భూసేకరణకు రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



చిన్నచింతకుంట, రత్నాపూర్ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

బాలికపై లైంగిక దాడి

నిందితుడికి 20 ఏళ్ల జైలు..

పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు

కంది, జూలై 24 : బాలికపై లైంగిక దాడికేసులో నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సంగారెడ్డి పోలీసులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా కంది మండలం తునికిళ్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడ తండాకు చెందిన నున్సావత్ ప్రకాష్ (22) ట్రాక్టర్ డ్రైవర్. 2019లో అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికపై లైంగికదాడి చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీకాంత్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.జయంతి ఎదుట నిందితుడిని హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో నిందితుడు ప్రకాష్‌కి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఇంటింటా జ్వర సర్వే

- ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నిత్యం 50 ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో పది రోజుల కిందటే ఫీవర్‌సర్వే ప్రారంభించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఆదేశించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఫీవర్‌సర్వేను పూర్తిగా ప్రారంభించలేదని తెలుస్తోంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం సమీక్ష నిర్వహించి, పకడ్బందీగా ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ చర్యలకుపక్రమించింది. సర్వేలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తిస్తే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు పంపుతారు. అక్కడ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో చికిత్స అందజేస్తారు. అక్కడ నయం కాకపోతే ఏరియా, జనరల్ ఆస్పత్రులకు పంపుతారు. జ్వర సర్వేలో భాగంగా రోజువారీ కేసుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన నమూనాలో జిల్లా ఆరోగ్యశాఖకు నివేదిస్తారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 35 డెంగీ కేసులు నమోదైనట్టు అధికారులు పేర్కొంటున్నారు.



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

స్వయం సహాయక సంఘాలకు రుణాలు

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



కల్హేర్‌లో ఐకేపీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

కల్హేర్, జూలై 24: మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించడం కోసం మహిళాశక్తి పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. కల్హేర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐకేపీ నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం కావడానికి మహిళాశక్తి పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా తీసుకున్న రుణాలతో వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు లాభాలు వచ్చే రంగాల్లో ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాడిగేదెల పెంపకం, డెయిరీఫారాలు, కోళ్లఫారాలు, క్యాంటీన్లు, పాలకేంద్రాలు, అహారశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆమె కల్హేర్‌లోని ఎస్‌బీఐని సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్డీవో జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి, కల్హేర్ ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం సాయిలు, మహిళా సంఘాల సమాఖ్యల సభ్యులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

మండల కేంద్రమైన కల్హేర్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతి విస్తృతంగా పర్యటించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేకపోవడం గమనించి బోధన మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కమ్యూనిటీ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వంద శాతం ప్రసవాలు ఇక్కడే జరిగేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆ తరువాత తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ధరణి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పీఏసీఎస్‌లలో రుణాలను మాఫీ చేయాలి

రైతు రుణమాఫీలో భాగంగా పీఏసీఎస్‌లలో తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేయాలని కాంగ్రెస్ నాయకులు నరేందర్, మల్లేశం, పోచయ్య, తుకారాం, దేవదాస్ కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. కల్హేర్, మార్డీ, బీబీపేట్, కృష్ణాపూర్, కడ్పల్ పీఏసీఎస్‌ల సీఈవోల నిర్లక్ష్యం కారణంగా రైతు రుణాలు సకాలంలో రెన్యూవల్ చేయలేదని, దీంతో మొదటి విడతలో రుణమాఫీ వర్తించలేదని ఫిర్యాదు చేశారు.

సెకండ్‌హ్యాండ్ బైక్ షాపులపై దాడులు

- తూప్రాన్‌లో 10 దుకాణాల్లో 400 బైకులు సీజ్

తూప్రాన్, జూలై 24: తూప్రాన్ పట్టణంలో పాత బైకుల విక్రయం, బైక్ ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న బైక్‌జోన్ షాపులపై పోలీసులు బుధవారం మెరుపు దాడులు చేశారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో దాడులుచేసి ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. 400 పాత బైక్‌లను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కొన్నేళ్లుగా పాత బైక్‌ల విక్రయించే బైక్ జోన్ షాపులు నిర్వహిస్తున్నారు. పాత వాహనాలు విక్రయిస్తూ అధిక వడ్డీ ఫైనాన్స్‌లు ఇస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా 10 దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పాత వాహనాల పేరు మార్పిడి చేయకుండా అమ్మకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 400 వరకు బైక్‌లు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పాత బైక్‌లకు ఫైనాన్స్ ఇచ్చి వడ్డీ నూటికి రూ.3 వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పత్రాలు లేని వాహనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. సీజ్ చేసిన బైక్‌ల పత్రాలను తనిఖీచేసి నిజమైన యజమానులేనా? చోరీ వాహనాలు ఉన్నాయా? అని పరిశీలిస్తామన్నారు.



తూప్రాన్‌లో బైక్‌లను సీజ్ చేస్తున్న పోలీసులు

వెల్దుర్తిలో 14 వాహనాలు..

వెల్దుర్తి : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీలక్ష్మి మోటార్స్ షోరూమ్‌లో వెల్దుర్తి పోలీసులు తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి శ్రీలక్ష్మి మోటార్స్‌లో వెల్దుర్తి ఎస్ఐ నవతాగౌడ్, సిబ్బందితో కలిసి షోరూమ్‌లో తనిఖీలు చేపట్టారు. ఆరు బైకులకు సంబంధించి ఆర్‌సీలు ఉండగా, 14 వాహనాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో బుధవారం ఉదయం షోరూమ్‌ను సీజ్ చేశారు.

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

- మెదక్ జిల్లాలో మూడు క్విక్ రియాక్షన్ టీమ్స్
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 24: ప్రజల భద్రతే పోలీసుశాఖ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన క్విక్ రియాక్షన్‌టీమ్‌లతో బుధవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మూడు క్విక్‌రియాక్షన్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేగవంతమైన స్పందన, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం, నిరంతర పర్యవేక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడం, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే శాంతి నెలకొల్పడం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. పౌరులకు భరోసా కల్పించేలా పోలీసింగ్ ఉంటుందని అన్నారు. శాంతికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల నియంత్రణ, కేసుల విచారణ, శాంతి భద్రత పరిరక్షణకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సైబర్ మోసం బారినపడితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని తెలిపారు.

ముసురు వానకు కూలిన ఇళ్లు

దుబ్బాక, జూలై 24 : నాలుగు రోజుల నుంచి కురుస్తున్న ముసురు వర్షానికి బుధవారం దుబ్బాక మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఎడ్ల లింగవ్వ పెంకుటిల్లు కూలిపోయింది. వర్షానికి ఇల్లు కూలిపోవడంతో సుమారు రూ.80వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఆమె బోరున విలపించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వార్డు కౌన్సిలర్ ఆస సులోచనస్వామి కోరారు.


దుబ్బాక 13వ వార్డులో కూలిన పెంకుటిల్లు

చిన్నశంకరంపేటలో పూరి గుడిసె

చిన్నశంకరంపేట, జూలై 24 : ముసురు వానకు పూరి గుడిసె కూలిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మాసాయిపేట సంగయ్య కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో వర్షానికికూలింది. గుడిసె పైకప్పు కట్టెలు కిందపడిపోవడంతో నిద్రస్తున్న వారు కేకలు వేస్తూ బయటకు వచ్చారు. సంగయ్య భార్య కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. ఉండడానికి స్థిర నివాసం లేక, తినడానికి తిండిలేకపోవడంతో బాధితులు పస్తులు ఉండే పరిస్థితి నెలకొన్నది. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఆర్ఐ గోవింద్ అక్కడకు చేరుకుని పంచనామ నిర్వహించారు. పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని గ్రామస్థులు కోరారు.

వేగంగా హెచ్ఎండీఏ చెరువుల హద్దుల గుర్తింపు

- గజం కూడా కబ్జా కాకుండా చర్యలు
- ఇప్పటికే 230 చెరువులకు నిర్ధారణ
- మరో 2,525 చెరువుల బఫర్‌జోన్
- గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్
- హైకోర్టుకు కమిషనర్ వివరణ
- రామమ్మకుంటలో ఆక్రమణలు
- నిజమేనని అంగీకరించిన ఏజీ

హైదరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని అన్ని జల వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేసినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హైకోర్టుకు నివేదించారు. రామమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం) సంస్థ భవన నిర్మాణాలు చేపడుతుండటంపై హైకోర్టులో గత ఏడాది ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను ఈ నెల 22న ఆదేశించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇచ్చారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించడంతో పాటు భవిష్యత్తులో గజం భూమి కూడా కబ్జాలకు గురికాకుండా సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేశామన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3,532 జలవనరులు, చెరువులు, కుంటలు ఉన్నాయని, 230 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చామని కమిషనర్ తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మరో 2,525 చెరువులకు ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ అయ్యాయని చెప్పారు. వాటిపై వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి మూడు నెలల్లో తుది నోటిఫికేషన్లు ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిన జలవనరులపై తీసుకున్న చర్యల పురోగతి నివేదికను వచ్చే వాయిదా నాటికి సమర్పిస్తామని తెలిపారు.

ఆక్రమణలు నిజమేనన్న ఏజీ

రామమ్మకుంట భూమిలో ఎన్ఐటీహెచ్ఎం సంస్థ కొంత భాగాన్ని ఆక్రమించినట్లు తేలిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అంగీకరించారు. ఈ విషయాన్ని ఏజీ ఉన్నది ఉన్నట్లు చెప్పారని ప్రశంసించిన ధర్మాసనం.. ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేసింది. వచ్చే వాయిదా నాటికి ఆక్రమణల తొలగింపుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. విచారణను నవంబరు 4కు వాయిదా వేసింది.

వ్యాక్సిన్ వికటించి మూడు నెలల పసికందు మృతి

● ప్రభుత్వాసుపత్రి వద్ద కుటుంబీకులు, గ్రామస్థుల ఆందోళన


మృతిచెందిన మూడు నెలల బాలుడు

పెద్దశంకరంపేట, జూలై 24 : వ్యాక్సిన్ వికటించడంతో మూడు నెలల పసికందు మృతిచెందగా, బుధవారం పెద్దశంకరంపేట ప్రభుత్వాసుపత్రి వద్ద తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన రాములు, మల్లేశ్వరి దంపతులకు మూడు నెలల క్రితం కుమారుడు జన్మించాడు. మల్లేశ్వరి పెద్దశంకరంపేట మండల పరిధిలోని బద్దారం గ్రామంలో ఉన్న తల్లిగారింట వద్ద ఉన్నది. బుధవారం ఉదయం మల్కాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మూడో నెల వ్యాక్సిన్ (పెంట వాలెట్)ను మూడు నెలల బాలుడికి వేయించింది. అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత బాలుడు అస్వస్థతకు గురికావడంతో గమనించిన మల్లేశ్వరి, ఆమె తల్లిదండ్రులు పెద్దశంకరంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే బాలుడి పల్స్ పడిపోవడంతో మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. వ్యాక్సిన్ వికటించడంతోనే బాలుడు మృతి చెందారని, వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను సముదాయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాలుడి మృతిపై వైద్యాధికారి వేదశ్రీని స్పందిస్తూ ఈ విషయంపై పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపడుతామని తెలిపారు.

సింగూరుకు ఎగువ ప్రవాహం నిల్

● లోకల్ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచే వరద

● ఇన్ ఫ్లో 1,444 క్యూసెక్కులు

పుల్‌కల్, జూలై 24: సింగూరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ఈ నెల 20వ తేదీ నుంచి కొద్దికొద్దిగా ప్రారంభమైన వరద నీటి చేరిక బుధవారం వరకు కొంత మెరుగైంది. ఈ నెల 20న 391 క్యూసెక్కులు, 22న 1,270 క్యూసెక్కులు, 23న 1,085 క్యూసెక్కులు, బుధవారం ఉదయం నాటికి 1,444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 519.630 మీటర్లకు 13.808 టీఎంసీల నీరు ఉంది. అవుట్ ఫ్లో 391 క్యూసెక్కులుగా నమోదైంది. సింగూరు ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది తీర ప్రాంతంలో కురుస్తున్న ముసురు వర్షానికే స్వల్పంగా ఇన్ ఫ్లో నమోదవుతున్నాయని ప్రాజెక్టు జేఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

త్వరలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించిన తర్వాత మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు సబ్జెక్టుల వారీగా ఖాళీలు, సీనియారిటీ జాబితాను రూపొందించే పనిలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల ఇచ్చిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నాట్ విల్లింగ్, నాన్ జాయినింగ్ ఖాళీల్లో అర్హత కలిగి ఉన్న వారి జాబితాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టి ఆ జాబితాను డీఎస్ఈకి పంపినట్టు అధికారులు తెలిపారు. కాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్వరలో జిల్లాలో ఖాళీగా ఉన్న 66 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులు ద్వారా భర్తీ చేయనున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

మిరుదొడ్డి, జూలై 24 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన బుధవారం మిరుదొడ్డి మండలంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పర్శరాములు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్వాల చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానం వచ్చిన పోలీసులు డీసీఎంను ఆపగా పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. కర్ణాటక రాష్ట్రంలోని బల్లారీ నుంచి దౌల్తాబాద్ మండలం వడ్డెపల్లి గ్రామానికి బియ్యంను తరలిస్తున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు తెలియజేయడంతో ఘటన స్థలానికి చేరుకుని సుమారు 150 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు అంచనావేసి, గోదాంకు తరలించారు. సివిల్‌సప్లై అధికారుల నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

జోగిపేట, జూలై 24 : అందోలు పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాత్రి అంధకారం నెలకొన్నదని విద్యార్థినులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హాస్టల్ భవనంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, రాత్రంతా కొవ్వొత్తుల వెలుగులోనే చదువుకున్నామని బుధవారం విద్యార్థినులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ విషయమై ప్రిన్సిపల్ శ్రీనివాసులును వివరణ కోరగా, తమ కళాశాల భవనంతోపాటు, ఆప్రాంతంలో ఉన్న మార్కండేయ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, తాము అదే సమయంలో విద్యుత్ శాఖాధికారులకు సమాచారమందించామన్నారు. అయితే, హెచ్‌టీ లైన్‌లో సమస్యతో అంతరాయం ఏర్పడిందని, బుధవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు, సరిదిద్ది, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని శ్రీనివాసులు వివరించారు.

రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులపై క్రిమినల్ కేసులు

● రేడియల్ రోడ్లపై ముమ్మర తనిఖీలు

రామచంద్రాపురం, జూలై 24 : నగరంలోని శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల, గోపన్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వరకు రేడియల్ రోడ్డు, ఎక్స్‌టెన్షన్ రోడ్ల పనులు ఏడెళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్లపై వాహనాలు అతివేగంగా ప్రయాణించడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రయత్నాలు చేపట్టారు. గత వారం తెల్లాపూర్ సాయిబాబా టెంపుల్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 9 మంది వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో ప్రయాణికులు ఒక్కసారిగా హడలెత్తి పోయారు. ఇక అతివేగంగా ప్రయాణికులను గుర్తించడానికి చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.


తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు

ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ రవీందర్

రోడ్డు ప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకుంటామని కొల్లూరు సీఐ రవీందర్ తెలిపారు. ఓఆర్ఆర్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్లు ఇప్పటికీ పూర్తి కాకపోవడం, పూర్తయినా చోట ఉన్న విల్లాలు, అపార్టుమెంట్లలో కుటుంబాలు రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రయాణికులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని , లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


వానాకాలం.. కరెంటుతో జరభద్రం

● పొంచి ఉన్న ప్రమాదాలు

● వ్యవసాయ పనుల్లో జాగ్రత్తగా ఉండాలి

● రైతులు, మూగజీవాలకు ముప్పు

● అప్రమత్తతతోనే రక్షణ



అక్కన్నపేట/ చిన్నకోడూరు, జూలై 24 : వానాకాలంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్లు, పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండడంతో బోరుబావులు, వ్యవసాయబావుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సాగుచేస్తున్నారు. ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. పశువుల పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలకు కారణాలు

● గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యన, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టూ కంచె లేకపోవడం

● గ్రామాల్లో ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వెళ్లడం

● వ్యవసాయ బావుల వద్ద పంట పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటం, విద్యుత్ తీగలకు ఊతంగా కర్రలను ఏర్పాటు చేయడం

● వర్షాకాలంలో ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటం, విద్యుత్ స్తంభాలు ఒక వైపు వంగడం, విరిగిపోవడం

● ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు మార్చడం, చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది

● వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్‌కు సరైన వైరింగ్ లేకపోవడం వల్ల ఏమరపాటుతో ఉంటే ప్రమాదాలు సంభవించటం

పాటించాల్సిన జాగ్రత్తలు

● విద్యుత్ మోటార్లు, నేలపై కాకుండా గద్దెలపై ఏర్పాటు చేసి స్టార్టర్ బోర్డులు తడవకుండా చూడాలి

● మోటార్లు పాడైతే మెకానిక్‌తో మరమ్మతులు చేయించాలే తప్ప సొంతంగా ప్రయత్నించవద్దు

● మోటార్లకు వాడే సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. ఒకవేళ వైర్లు దెబ్బ తింటే వెంటనే టేపు వేయాలి

● విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి, అదేవిధంగా స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటర్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి

● సబ్ మెర్సిబుల్ మోటార్లతో పాటు విద్యుత్ వైరు ఉంటుంది. ఏ కొంచెం వైరు తెగినా పైన ఉన్న పరికరాలకు సరఫరా జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి గమనించాలి.

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయకూడదు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర స్విచ్చాన్, ఆఫ్ చేసేటప్పుడు, మోటార్ స్టార్టర్ స్విచ్ ఆన్ ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

● విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదు

● తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లను, పరికరాలను ముట్టుకోకూడదు

● పశువులను విద్యుత్ స్తంభాలకు, సమీపంలో కట్టి వేయొద్దు

నష్టపరిహారం ఇలా..

విద్యుత్ సంస్థ మూడు రకాలుగా ప్రమాదాలకు నష్టపరిహారం అందిస్తుంది. అకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు, పశువులు మరణిస్తే పరిహారం అందిస్తారు కానీ గాయాలకు ఇవ్వరు. మనుషులు మరణిస్తే రూ.5 లక్షలు, పశువులు మరణిస్తే రూ.40 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే రూ.7 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు. ప్రమాదంలో మనిషి మరణిస్తే ఘటనా స్థలంలో తీసిన ఫొటోలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామ పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకు అయితే ఫొటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నివేదికను అందజేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వానాకాలం సీజనల్‌లో ప్రమాదాల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర స్విచ్చాన్, ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధిక లోడు ఉంటే ముందే సమాచారం ఇవ్వాలి. తీగలు తెగిపడినా, కిందికి వేలాడుతున్న ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందిస్తే మరమ్మతులు చేపడతాం.

- దుర్గ శ్రీనివాస్, ఏడీఈ ఆపరేషన్, (టీజీఎస్‌పీడీసీఎల్)హుస్నాబాద్

విద్యుత్ సమస్యలుంటే సమాచారం ఇవ్వాలి

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే, సొంతంగా మరమ్మతులు చేయకూడదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

-రమేష్, విద్యుత్‌శాఖ ఏఈ, చిన్నకోడూరు సెక్షన్

కరెంట్ వైర్లు తగిలి వ్యవసాయ కూలి మృతి


లక్మ(ఫైల్)

రామాయంపేట, జూలై 24 : పొలం పనికి వెళ్లిన కూలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి కాట్రియాల గ్రామ శివారు పన్యా తండాలో చోటుచేసుకున్నది. ఇదే మండలం బాపనయ్య మోత్కుల తండాకు చెందిన లంబాడి లక్మ(43) వ్యవసాయ కూలిగా పనిచేసుకుంటూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులాగే బుధవారం ఉదయం ఓ రైతు పొలానికి పని కోసం వెళ్లాడు. అయితే, అప్పటికే బోర్ మోటార్‌కు సరఫరా అయ్యే కరెంట్ సర్వీస్ వైర్లు పొలంలో తెగిపడ్డాయి. ఇది గమనించకుండా లక్మ పొలంలోకి దిగగా షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. కాగా ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈ మేరకు ఎస్ఐ రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్యాక్స్ చైర్మన్లపై అవిశ్వాసం

● నేడు టేక్మాల్ సింగిల్ విండో చైర్మన్‌పై.. రేపు బీబీపేటలో

● క్యాంపులో డైరెక్టర్లు.. ఓటింగ్ సమయానికి కార్యాలయానికి


టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

టేక్మాల్, జూలై 24 : టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) కార్యాయలంలో గురువారం అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా, అందోలు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టుపెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో టేక్మాల్ సింగిల్ విండోలో అవిశ్వాసానికి తెర తీశారు. ఇక్కడ 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక్కరు మరణించారు. మిగతా వారిలో ఎనిమిది మంది డైరెక్టర్లు సింగిల్ విండో చైర్మన్ కుచన్‌పల్లి యశ్వంత్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈనెల 3న డీసీవోకు వినతి పత్రం అందజేశారు. అవిశ్వాస తీర్మానంపై గురువారం ఉదయం 11 గంటలకు సంఘం కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 8 మంది డైరెక్టర్లు క్యాంపులో ఉన్నారు. వారు నేరుగా ఓటింగ్ సమయానికి కార్యాలయానికి వస్తారని తెలిసింది. సింగిల్ విండో కార్యాలయంలో ఓటింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అవిశ్వాసం నెగ్గుతుందా, వీగిపోతుందా ఉదయం తేలనున్నది.

బీబీపేటలో అవిశ్వాసంపై ఉత్కంఠ

కల్హేర్, జూలై 24 : మండల పరిధిలోని బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) చైర్మన్ ఎం.నరేందర్‌రెడ్డిపై ఈ నెల 26న అవిశ్వాసం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి నోటీసు జారీ చేశారు. ప్యాక్స్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఏడుగురు ఈ నెల 5న సంగారెడ్డిలోని డీసీవో కార్యాలయంలో అవిశ్వాస నోటీసు అందజేశారు. అయితే 13 మంది డైరెక్టర్లలో దేన్యా నాయక్ మరణించగా మిగతా 12 మందిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు నలుగురు మాత్రమే ఉండగా బీఆర్ఎస్‌కు 8 మంది డైరెక్టర్లు ఉన్నారు. కాంగ్రెస్ మరో ముగ్గురి సహాయంతో అవిశ్వాస నోటీసును అందజేసింది. అయితే, అవిశ్వాసం ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు తేదీ నిర్ణయం కాగానే బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు డైరెక్టర్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లు క్యాంపునకు తరలించడంతో కాంగ్రెస్ డైరెక్టర్లు ఒక్కసారిగా కుంగుతిన్నారు. కాంగ్రెస్‌కు ఉన్న నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు బీఆర్ఎస్ క్యాంపులో చేరిపోవడంతో అవిశ్వాసం నెగ్గుతుందా వీగిపోతుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది.


కర్ణాటక క్యాంపులో బీబీపేట ప్యాక్స్ డైరెక్టర్లు

దౌల్తాబాద్ ఏఎంసీ పదవులు మాకే ఇవ్వాలి

దౌల్తాబాద్, జూలై 24 : దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తమకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆది బాలకృష్ణ, దుద్దెడ స్వామి కోరుతున్నారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తాము పదవులకు అర్హులమని తమకు కేటాయించాలని వారు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని కోరుతున్నారు. దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు, టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పుడు తాము ముత్యంరెడ్డి వెంట నడిచి ఆయన గెలుపు కోసం కృషి చేశామని గుర్తుచేశారు. అనంతరం ముత్యంరెడ్డి టీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లగా, తాము కాంగ్రెస్‌లోనే కొనసాగమన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా తమను గుర్తించి పదవులను కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● లేదంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్


అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 24 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, లేదంటే బీసీ కులాలు ఏకమై వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమగ్ర కులగణన సాధన యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణన చేపడితే బీసీలు శాసించే స్థాయికి ఎదుగుతారనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేయకుండా వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. బీసీలు లేకుండా దేశంలో ఏ రాజకీయ పార్టీ ముందుకు సాగలేదని, బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని విమర్శించారు. బీసీ అంటే బ్యాక్ వార్డ్ క్లాస్ కాదని బ్రిల్లియంట్ క్లాస్ అని అభివర్ణించారు. బీసీ సమగ్ర కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు జంకుతున్నదో చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలో వచ్చిన వెంటనే సమగ్ర కుల గణన చేపడతామని జీవో జారీ చేసి రూ.150 కోట్లు నిధులు మంజూరు చేసినా ఎందుకు తాత్సారం చేస్తున్నదని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు శ్రీనరివాస్, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేష్‌చారి, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి రాజు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాహుల్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, నాయకులు రమేష్, బాలు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 24 : మెదక్ జిల్లాలో రూ.లక్ష లోపు రైతు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని, ఖాతాల్లో జమకాని రైతులు ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం ఆయన చాంబర్‌లో వ్యవసాయ, లీడ్ బ్యాంకు మేనేజర్, కో-ఆపరేటివ్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మెదక్ జిల్లాలో 47,616 మంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీలో భాగంగా రూ.237.50 కోట్లు మాఫీ జరిగిందన్నారు. వ్యవసాయ భూమి ఉండి రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఇందులో ఎవరికైనా రుణమాఫీ జరగకపోతే మండల, జిల్లా వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లాలో మిగిలిన రైతులకు రుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరలోనే మాఫీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు గోవింద్, నరసింహమూర్తి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

● సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

ములుగు, జూలై 24 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి, రక్త నమూనాలను సేకరించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చుట్టూ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. హాస్టల్, పాఠశాల విద్యార్థులకు వేడివేడి అన్నాన్ని అందించాలని కోరారు. హాస్టళ్లల్లో విద్యార్థులకు అవసరం ఉన్న మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి అఖిల, మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా నిత్యావసరాల సరఫరా

● వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

● తప్పనిసరిగా వెయింగ్ మిషన్‌లు తనిఖీ చేయాలి : అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, జూలై 24 : జిల్లాలో పౌరసరఫరాల నిత్యావసర వస్తువుల సరఫరా పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ కార్డు, క్వాలిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని క్షేత్రస్థాయిలో సమస్యలను ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా రేషన్ షాపులో ఉన్న ప్రతీ వెయింగ్ మిషన్‌ను తనిఖీ చేసి, తేడాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీడీఎస్ నాణ్యమైన బియ్యం డెలివరీ చేయాలని, టెక్నికల్ అసిస్టెంట్లతో నిత్యం క్వాలిటీ చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శునకాలు అడవులకు

● జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో పట్టివేత

జహీరాబాద్, జూలై 24 : జహీరాబాద్ పట్టణంలో ఎక్కడపడితే అక్కడ కుక్కల సంఖ్య అధికమైంది. వీధుల్లో కుక్కల హల్‌చల్‌తో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ గొర్రెలు, మేకలు, లేగదూడలపైనా దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజల ఫిర్యాదుల మేరకు మున్సిపల్ అధికారులు బుధవారం నుంచి జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో సిబ్బంది చేత కుక్కలను పట్టిస్తున్నారు.

పట్టణంలో సుమారు 3000 పైచిలుకు కుక్కలు ఉంటాయని మున్సిపల్ అధికారులు అంచనావేశారు. బుధవారం కుక్కలను పట్టేవారు సుమారు 80 వరకు పట్టుకున్నారు. రోజు వారీగా పట్టణంలో పట్టిన కుక్కలను సమీపంలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని కుంచారం, తదితర అటవీ ప్రాంతంలో వదిలేందుకు నిర్ణయించారు. వాటిని అడవుల్లో వదిలాక ఆయా ప్రాంతాల్లో తిరుగుతు వన్యప్రాణులపై, పశు, పక్షాదులపై దాడులు చేయడం, సమీపంలో గల మరో గ్రామానికి వెళ్లడం సహజమే. అయితే, వాటికి ఇంజక్షన్‌లను వేస్తే సంతతి తగ్గడంతోపాటు, ఎవరిని కరిచిన ప్రమాదకరంగా ఉండదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జంతుప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు కుక్కలను అడవుల్లోకి తరలించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఎప్పటికప్పుడు అధికారులు స్పందించి వాటికి ఇంజక్షన్‌లను వేస్తే బాగుంటుదని పేర్కొంటున్నారు. అధికారులు మాత్రం వాటిలో కొన్నింటిని పట్టి అడవుల్లో వదిలేసి, మరికొన్నింటికి ఇంజక్షన్‌లు వేస్తామని వివరిస్తున్నారు.


జహీరాబాద్‌లో పట్టుకున్న కుక్కలు


జహీరాబాద్‌లో పట్టుకుంటున్న కుక్కలు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

● సంగారెడ్డి పట్టణ ఎస్ఐ నర్సింహులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఎస్ఐ నర్సింహులు

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : అప్రమత్తతతోనే ప్రమాదాల నివారించవచ్చని సంగారెడ్డి పట్టణ ఎస్ఐ నర్సింహులు తెలిపారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు అరికట్ట వచ్చన్నారు. డిపో మేనేజర్ ఉపేందర్, అసిస్టెంట్ మెకానిక్ ఇంజనీర్ మూర్తి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సు నడపాలి

నారాయణఖేడ్,జూలై 24: డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని ఖేడ్ ఆర్టీసీడీఎం మల్లేశయ్య సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్లు వాడవద్దన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్ల లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ సురక్షిత డ్రైవింగ్‌కు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నర్సింలు, మెకానికల్ ఇంజనీర్ దశరత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 24: సంగారెడ్డి కెనాల్ కోసం తమ భూములు ఇవ్వబోమంటూ రైతులు చేపట్టిన దీక్ష బుధవారం 13వ రోజుకు చేరింది. ఒకవేళ కచ్చితంగా తీసుకోవాల్సి వస్తే మా భూములకు తగిన పరిహారం ఇస్తామని హామీ ఇవ్వాలని అంతవరకు భూములు ఇవ్వమంటూ తెగేసి చెప్పారు. దీక్షలో బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట, లింగాపూర్, పెద్దచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. దీక్షకు బీఎస్పీ నాయకుడు జనార్దన్‌గౌడ్ మద్దతు పలికారు.

చిరు జల్లులకే రోడ్లు చిత్తడి

● గుంతలమయమైన సీసీరోడ్లపై తేలిన కంకర
● పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు
● కందిలోని సాయికాలనీవాసుల దుస్థితి





చిన్నవర్షానికే సాయి కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు, గుంతల్లో నిలిచిన నీరు, గుంతలమయమై కంకర తేలిన సీసీ రోడ్డు

కంది, జూలై 24: సంగారెడ్డి జిల్లాకేంద్రానికి సమీపంలోని కంది మండలకేంద్రంలోని సాయి కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చాలు చిత్తడిగా మారి కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. చిరు జల్లులు కురిసినా ద్విచక్రవాహనదారులకు, కాలనీవాసులకు ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తున్నది. సీసీరోడ్లపై కూడా బురదనీరు చేరి, నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంటున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే మురుగు కాల్వలు ఉండడంతో వర్షం పడితే మురుగు నీరు రోడ్లపైకి చేరుతున్నది. కాలనీలో సీసీ రోడ్డు పనులను కొన్ని వీధుల వరకే పూర్తి చేయడంతో మిగతా సగం వీధుల్లో ఉన్న మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. రెండేళ్ల క్రితం కాలనీలో వేసిన సీసీరోడ్ల నిర్మాణం పనులో నాణ్యత కొరవడటంతో వర్షం పడినప్పుడు సీసీరోడ్లపై నీరు నిలిచిపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. . బుధవారం బురదమయంగా మారిన రోడ్లపై నుంచి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బురదలో వాహనాలు అదుపు తప్పి కింద పడతాయేమోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది

గుంతలమయంగా సీసీ రోడ్లు

రెండేళ్ల క్రితం సాయి కాలనీలో వేసిన సీసీ రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయి. రోడ్ల పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. సీసీ రోడ్లపై నీళ్లు నిలిచి ఉండడం, గుంతలుగా మారడం, కంకర పైకి తేలడం పట్ల కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసిన సీసీ రోడ్లే గుంతలమయంగా మారితే, ఇక రోడ్డు వేయని మిగతా సగం వీధుల్లో పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాయి కాలనీలో దాదాపు 100 ఇళ్ల వరకు ఉండగా, రూ. వేలాదిగా పంచాయతీకి టాక్సులు కట్టినా తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పాడైన రోడ్డును వెంటనే బాగుచేయాలి



డీసీసీ బ్యాంకు ఎదుట వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారిన రోడ్డు

కోహీర్ జూలై 24: మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంకు ఎదుట గల ప్రధాన రహదారి పాడై నెలలు గడుస్తున్నా బాగు చేయడం లేదని కోహీర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం పాడైన రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోహీర్‌లోని ప్రధాన రహదారి పాడై పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలబడడంతో చాలామంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.22లక్షలు కేటాయించి, టెండర్ ఖరారు చేసినప్పటికీ ఎందుకు పనులు ప్రారంభించలేదని వారు ప్రశ్నించారు. రోడ్డుపై నిలబడి నిరసన తెలపడంతో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు రోడ్డు సమస్యపై ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో రోడ్డు పనులు చేపడతామని అధికారులు తెలపడంతో యువకులు వెనుదిరిగారు.

సజ్జాపూర్‌లో ఘనంగా బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోహీర్ జూలై 24: మండలంలోని సజ్జాపూర్‌లో బుధవారం గ్రామదేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, ఊరడమ్మ దేవతలకు గ్రామస్థులు ఘనంగా బోనాలను సమర్పించుకున్నారు. గ్రామపెద్ద ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం గ్రామస్థులు గ్రామ దేవతలకు ప్రత్యేకపూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మహిళలు పెద్దసంఖ్యలో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా సాగిన ఊరేగింపులో బాజా భజంత్రీల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి బోనాలు సమర్పించారు.

ఆర్టీసీ మెదక్ రీజియన్‌లో 26మందికి పదోన్నతి

సంగారెడ్డి అర్బన్, జూలై 24 : ఆర్టీసీ మెదక్ రీజియన్‌లో పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. రీజినల్ మేనేజర్ ప్రభులత 26 మందికి పదోన్నతి పత్రాలను బుధవారం అందజేశారు. కండక్టర్ నుంచి కంట్రోలర్, ఏడీసీ పదోన్నతి పొందినవారిని ఆర్ఎం అభినందించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ రాజయ్య, డిప్యూటీ ఆర్ఎం, అసిస్టెంట్ మేనేజర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో అధికారులు బదిలీలు

నర్సాపూర్, జూలై 24:రాష్ట్రస్థాయిలో ఆయాశాఖలలో జరుగుతున్న బదిలీల ప్రక్రియలో భాగంగా నర్సాపూర్‌లో కూడా పలు శాఖల అధికారులు బదిలీ అయ్యారు. నర్సాపూర్ అటవీశాఖ రేంజ్ అధికారి అంబర్‌సింగ్ హైదరబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మం నుంచి అరవింద్ బదిలీపై రానున్నారు. అదేవిధంగా సబ్‌రిజిస్ట్రార్ నిలోఫర్ బదిలీపై మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో ఇంకా ఎవరు రాలేదు. గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న భిక్షమయ్య బదిలీపై వరంగల్ జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో కొడంగల్ నుంచి ఈ.బాలరామ్, అటవీశాఖ సెక్షన్ అధికారిగా ఉన్న బాలేషం బదిలీపై జగదేవ్‌పూర్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో కొండపాక నుంచి సాయిరాం రానున్నారు.

ఇళ్లు కూలిన బాధితులకు పునరావాసం కల్పించాలి

చిన్నశంకరంపేట, జూలై 24: వర్షాలకు గ్రామాల్లోని పురాతన ఇళ్లు కూలితే బాధితులకు పునరావాసం కల్పించాలని ఎంపీడీవో దామోదర్ స్పెషల్ ఆఫీసర్లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే అందుబాటులో ఉండి పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. వాటర్ ట్యాంకులను, మురికి కాలువలను శుభ్రం చేయించాలని ఆయన సూచించారు. ఇళ్లు కోల్పోయిన బాధితుల వివరాలను సేకరించి రెవెన్యూ అధికారులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కలిమొల్ల, ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోహిద్‌ఖాన్



కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మోహిద్‌ఖాన్

నారాయణఖేడ్, జూలై 24: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావ్ జన్మదినం సందర్భంగా ఆయనకు నారాయణఖేడ్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు మోహిద్‌ఖాన్ శుభా కాంక్షలు తెలియజేశారు. బుధ వారం హైదరాబాద్‌లో కేటీఆర్ స్వగృహానికి వెళ్లి మోహిద్‌ఖాన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.


కుంగ్‌ఫూ, కరాటేలో 'కరుణ' విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జూలై 24: కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లోని కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 4 బంగారు పతకాలు, 5 వెండి పతకాలు సాధించారు. అండర్-9 కువైట్ విభాగంలో భావ్యష్ బంగారుపతకం, అండర్-14 విభాగంలో సాహెజబ్, రోహన్ వెండి పతకం, అండర్-9 విభాగంలో అమరనిషాద్, మహిమశ్రీ, బాలాదిత్య అండర్-12 విభాగంలో అశ్విత్, అండర్-14 విభాగంలో జిషాన్ ప్రతిభ కనబర్చారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కరస్పాండెంట్ మేరిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బడుగు బలహీన వర్గాల బడ్జెట్: బీజేపీ



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గోదావరి అంజిరెడ్డి, బీజేపీనాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడేలా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అణగారిన ప్రజల బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సంగారెడ్డిలో బుధవారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించి రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు, మాణిక్‌రావు, అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కార్యాలయ కార్యదర్శి విజయకుమార్, కౌన్సిలర్లు నాగరాజు, వాసు, పట్టణ అధ్యక్షుడు ద్వారకరవి, నాయకులు ఉన్నారు.

గురుకుల కళాశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ

రామాయంపేట, జూలై 24: బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన సొంత ఖర్చులతో రామాయంపేటలోని స్థానిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలకు వాటర్ ప్లాంటు ఇచ్చారు. ఈ మేరకు రూ.70 వేల విలువైన చెక్కును ప్రిన్సిపాల్ భారతికి అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్‌జితేందర్ గౌడ్,సరాఫ్ యాదగిరి, పుట్టి విజయలక్ష్మి, బాదే చంద్రం, శారద రాజు, అనిల్, అందే కొండల్ రెడ్డి,చింతల యాదగిరి, శ్యాంలు ఉన్నారు.

శివాలయానికి రూ.4లక్షల విరాళం

జిన్నారం, జూలై 24: జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయానికి బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి రూ.4లక్షల విరాళం అందజేశారు. బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అనిల్‌రెడ్డిని కలిశారు. ఆలయ గర్భగుడి, మండపానికి శ్లాబు, కాంక్రీట్ కోసం విరాళాన్ని అందజేశారు.

గాంధీ కుటుంబానికి మోకరిల్లుతున్న రేవంత్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 24: కేంద్రంలో గాంధీకుటుంబం వద్ద తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మొకరిల్లుతున్నాడని బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా అధికారప్రతినిధి బక్కయ్యగుప్తా విమర్శించారు. బుధవారం వారు మాట్లాడుతూ కేంద్రఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని, మీలా పదవికోసం నాలుగు పార్టీలు మారలేదని వారు గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయండి

● ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్



ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్

జోగిపేట, జూలై 24: గ్రామీణ ప్రాంతాల ప్రజల ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని, ఉత్సాహవంతులైన ప్రజలకు జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఇంటింటా ఇన్నోవేటర్-2024 అనే కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను జోగిపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ఇతర చేతివృత్తులవారు తమ రోజువారీ పనులు చేసుకోవడంలో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను దూరం చేసేందుకు ఉపకరణాలను తయారు చేసేలా ప్రజలను ప్రోత్సహిస్తూ, వారి సృజనాత్మకతను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్-2024 అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా వస్తువులు, ఉపకరణాలను తయారు చేసి దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను, తయారీకి కావాల్సిన వస్తువులు వివరాలను, తయారీ విధానాన్ని ఫోన్ నెం.9100678543కు వాట్సాప్ ద్వారా/ క్యూఆర్ కోడ్ ద్వారా పంపాలన్నారు. ఇలా పంపడానికి ఆగస్టు 3 చివరి తేదీ అని వివరించారు. ఉత్సాహవంతులైనవారు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్, కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్ సాయిశ్రీజ, ఏవో విజయరత్న, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

పటాన్‌చెరు, జూలై 24: మహిళలు చట్టపరంగా తమ హక్కులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారికత కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వంద రోజుల మిషన్ శక్తి అవగాహన సదస్సులో భాగంగా బుధవారం పటాన్ చెరు అబ్దుల్‌కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగపరంగా మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించారన్నారు. దురదృష్టవశాత్తు వాటిపై సంపూర్ణ అవగాహన లేకపోవడం వల్ల అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోసం ముందుకు రావడం లేదన్నారు. వారు ధైర్యంగా ముందడుగు వేసి తమ హక్కుల గురించి ప్రశ్నిస్తే చట్టపరిధిలో వారికి సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని ఇతరులకు సహాయ పడాలన్నారు. చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులు ఎదగాలన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. సీడీపీవో చంద్రకళ మాట్లాడుతూ భ్రూణహత్యలు, బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ అంబరీయ, జిల్లా సాధికార కేంద్రం సమన్వయకర్త పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీస్థలాలకు ఇంటినెంబర్ల కేటాయింపులు

● ఎంపీఈవో, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి: గ్రామస్థుల ఆందోళన



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాచ్నూర్ గ్రామస్థులు

ఝరాసంగం, జూలై 24: మండలంలోని మాచ్నూర్ గ్రామ కంఠంలోని ఖాళీ స్థలాలకు ఇంటినెంబర్లను కేటాయించి అక్రమాలకు తెరలేపిన ఎంపీఈవో, పంచాయతీకార్యదర్శిపై చర్యలు చేపట్టాలని గ్రామమాజీ సర్పంచ్ రాజు, తీన్మార్‌మల్లన్న టీం సభ్యులు నర్సింహులు, లక్ష్మయ్య, రత్నం డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్నామనే సాకుతో మార్చి 20వ తేదీ నుంచి అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గ్రామంలోని ఖాళీ స్థలాలకు విచ్చలవిడిగ ఇంటినెంబర్లను కేటాయించి అక్రమాలకు తెరలేపారన్నారు. అలాగే కేంద్రీయ విద్యాలయంవద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరికి కేటాయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరు అధికారులు బదిలీపై వెళ్త న్నారని, వారిని రిలీవ్ చేయకూడదని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా తమ మాటలకు లెక్కచేయకుండా రిలీవ్ చేశారన్నారు. రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే సుమారు 23మందికి ఆ భూమిలో అసెస్‌మెంట్ చేశారని, ఇందులో ఎంపీడీవో పాత్ర ఉందని వారు ఆరోపించారు. గ్రామ సమీపంలోని విలువైన గ్రామకంఠం భూమిని అధికారులు కొందరితో కుమ్మక్కై ఇళ్లనెంబర్‌లను కేటాయించడమేంటని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవచూపి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై అభిప్రాయాలు

● సంగారెడ్డి రూరల్, జూలై 24: సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీకి చక్కర్లు కొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈ విషయాన్ని ప్రస్తావించి బడ్జెట్‌ను సవరించాలని కోరాలన్నారు.

● జోగిపేట: ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మొండి చేయి చూపిందని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు. బుధవారం ఆయన జోగిపేట, వట్‌పల్లిల్లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీని నిధుల కోసమే మర్యాద చేశామన్న రేవంత్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తాము గెలిస్తే నిధులు వస్తాయని బీజేపీ నాయకులు, మెడలు వంచి నిధులు తెస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలు పలికారని, మరి కేంద్రం ఒక్క రూపాయి కూడా విదిల్చలేదన్నారు.

● జిన్నారం: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య అన్నారు. బుధవారం బొల్లారంలో మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఇద్దరు కేంద్ర మంత్రి పదవులు పొందారని, అయినా రాష్ట్రానికి బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు.

● జహీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఎంపీలే ఉన్నారన్నారు. చదువుకునే వారిలో భారత్ మొదటి స్థానంలో ఉండగ సదుపాయాల కల్పనలో 32వస్థానంలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు.

● రామాయంపేట: రాష్ట్రానికి కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గుండు సున్నాయే దక్కిందని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి విమర్శించారు. అదే బీఆర్ఎస్ ఎంపీలు ఉన్నట్లయితే దీనిపై లోక్‌సభలో కొట్లాడేవారన్నారు. ఆయన బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తమకు మద్దతు ఇస్తున్న ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలకే ఈ బడ్జెట్ లో ఎక్కువ కేటాయించారని ఆరోపించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



విష్ణు(ఫైల్)

కల్హేర్, జూలై 24: గ్రామంలో జరిగిన గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మహాదేవ్‌పల్లి శివారులోని 161వ జాతీయ రహదారి సమీపంలో బుధవారం వెలుగు చూసింది. కల్హేర్ ఏఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండల పరిధిలోని అనంత్‌సాగర్ గ్రామానికి చెందిన బేగారి విష్ణు(22) అనే యువకుడు హైదరాబాద్‌లో కారు నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్నాడు. ఇటీవల గ్రామానికి చేరుకున్న విష్ణు ఓ గొడవకు కారణమయ్యాడనే ఆరోపణపై పంచాయతీ పెట్టాలని కొందరు గ్రామస్థులు నిర్ణయించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విష్ణు మహాదేవ్‌పల్లి శివారులోని ఓ వ్యవసాయభూమిలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. జాతీయ రహదారి పక్కన కారు నిలిపి చెట్టుకు ఉరి వేసుకోగా మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి భూమి యజమానికి తెలుపడంతో ఆయన కల్హేర్ పోలీసులుకు సమచారమందించారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

చేగుంట జూలై 24 : పొలం వద్ద బావిలో మోటార్ దింపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పులబోయిన రాజు(40) తన వ్యవసాయ పొలం వద్ద బావిలో మోటార్ దింపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. బావి పొలం గట్టుకు చెప్పులు బట్టలు ఉండడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఈతగాళ్ల సహాయంతో బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య రుక్మిణి, కొడుకు కూతురు ఉన్నారు. చేగుంట ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నర్సాపూర్, జూలై 24: నర్సాపూర్ పట్టణంలోని 10వ వార్డు శ్రీరాంనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో బుధవారం ఉదయం చోరీ ఘటన చోటు చేసుకున్నది. బాధితుడు టీచర్ ధన్‌సింగ్ కథనం ప్రకారం.. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి తాను పాఠశాలకు వెళ్లగా తన భార్య మెదక్‌కు వెళ్లిందన్నారు. అయితే సాయంత్రం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయన్నారు. అల్మారను కూడా తీసి అందులో ఉన్న రూ.2వేల నగదు అపహరించినట్టు తెలిపాడు.

చండీ ఎల్లమ్మ ఆలయంలో..

శివ్వంపేట, జూలై 24: మండలంలోని చండీ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ హుండీలోని నగదును బుధవారం గుర్తుతెలియని దుండగులు అపహరించుపోయారు. గ్రామస్థులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండీ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి గుడిలో చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించారు. ధ్వంసం చేసిన హుండీని సమీపంలోని పంట పొలంలో వేసి వెళ్లిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టారు. అదే విధంగా గూడూరు గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఆటోలో డిక్కీని ధ్వంసం చేశారని గ్రామస్థులు తెలిపారు.

షాబా తండాలో భూవివాదంపై విచారణ

టేక్మాల్, జూలై24: మండల పరిధిలోని షాబా తండాలో ఇటీవల జరిగిన భూ వివాదంపై అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఎస్ఐ మురళి విచారణ చేపట్టారు. గ్రామంలోని సర్వే నెంబరు 86లో 360 ఎకరాల అటవీ భూమిలో కొంత మంది పోడు వ్యవసాయం చేస్తున్నారు. గత కొంత కాలంగా వారికి వివాదం నెలకొంది. మూడు రోజుల క్రితం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా పరస్పరం దాడులు చేసుకున్నారు. మంగళవారం జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి విచారణ చేపట్టారు. భూవివాదం పరిష్కారమయ్యే వరకు ఎవరూ భూమిలోకి రావద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పెద్దల సమక్షంలో వివాదంపై సంబంధించిన ఇరువర్గాల వారు మాట్లాడుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్, ఆర్ఐ సాయిశ్రీకాంత్, ఏఎస్ఐ తుక్కయ్య, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొల్చారంలో అనుమతి లేని పాఠశాల సీజ్

కొల్చారం, జూలై 24: మండల కేంద్రమైన కొల్చారంలో అనుమతి లేకుండా నడుపుతున్న లేక్ వ్యూ ప్రైవేట్ పాఠశాలను బుధవారం ఎఈవో నీలకంఠం సీజ్ చేశారు. ఈ పాఠశాలకు యూ డైస్ కోడ్ లేనందున భవిష్యత్తులో విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. మళ్లీ పాఠశాల యాజమాన్యం గుర్తింపు పొందిన వెంటనే పాఠశాలను తెరుస్తారని తెలిపారు.

తండాలో రెండవ రోజు వైద్య శిబిరం



తండాలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చేగుంట జూలై 24 : చేగుంట మండలంలోని జైత్రం తండా పరిధిలోని వైద్య శిబిరం రెండో రోజు కొనసాగింది. డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తండాలోని ఇంటింటా జర సర్వే నిర్వహించారు. ఇటీవల తండా పరిధిలోని కొంతమందికి డెంగీ లక్షణాలు నిర్ధారణ కావడంతో జిల్లా అధికారులు వైద్య సిబ్బంది అప్రమత్తమై తండాలోని పరిసరాలు పరిశుభ్రంగా చేసి వర్షపు నీరు నిలువకుండా ట్రాక్టర్‌తో చదును చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటి అవరణలో ఉన్న పాత నీటి తొట్టిలను తొలగింపజేసి, తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపతి,ల్యాబ్ టెక్నీషియన్ నర్సింహులు, ఎంఎల్‌హెచ్‌పీలు, అశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండండి

పాపన్నపేట, జూలై 24: డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాకాలం దోమల వల్ల వచ్చే వ్యాధులు ప్రబల కుండా వర్షపు నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. పలు రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి హరిప్రసాద్, సీహెచ్‌వో చందర్ తదితరులున్నారు.

సంగారెడ్డిలో బడ్జెట్ పత్రాలు దహనం

సంగారెడ్డి రూరల్, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉన్నదని సీపీఎం నిరసన తెలుపుతూ బుధవారం సంగారెడ్డిలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు, ఉమ్మడి మెదక్ జిల్లాకు మొండి చేయి చూపించిందని విమర్శించారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు ప్రవీణ్, నర్సింలు, నాయకులు అశోక్, కృష్ణ, రాజయ్య సంతోష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి: ఆర్డీవో

అల్లాదుర్గం, జూలై 24 : రైతులకు ఇబ్బందులు కలగకుండా ధరణి సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన పలు సమస్యలను ఎప్పడికప్పడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అల్లాదుర్గం మండలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం 67 మంది లబ్ధిదారులకు మంజూరైనట్టు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతోంది'

సంగారెడ్డి రూరల్: బీజేపీ ప్రజల మధ్య వైష్యమ్యాలు పెంచడంతో పరిస్థితులు దేశాభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయక ప్రజలపై దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా కాలరాస్తూ బీజేపీ పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జయరాజ్, జలాలొద్దిన్‌లు మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, నర్సింహులు, అశోక్, కృష్ణ, సీపీఐ నాయకులు వజీర్ బేగ్, మహబూబ్‌ఖాన్, అజారుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.